నమస్తే తెలంగాణ
నాగర్‌కర్నూల్
5 | మహబూబ్‌నగర్, శనివారం 15 ఫిబ్రవరి 2025 | NAGARKURNOOL

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో కలిసి తన కుమార్తె ప్రీతిరెడ్డి వివాహానికి హాజరుకావాలని శుభలేఖను అందజేశారు. అదేవిధంగా కేసీఆర్ చిత్రాలతో ప్రత్యేకంగా నేయించిన శాలువాతో సన్మానించారు. -మూసాపేట, ఫిబ్రవరి 14

మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి దంపతులు తమ రెండో కుమారుడు పృథ్వీషారెడ్డి వివాహాన్ని ఈ నెల 23న హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. - మక్తల్, ఫిబ్రవరి 14

కల్వకుర్తి జాగృతి జిల్లా నాయకురాలు మిర్యాల పావనిని అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నది. శుక్రవారం భారత జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, నిజామాబాద్ ఎమ్మెల్సీ కవిత అల్మాస్‌గూడలోని ఇంటికి వెళ్లి పరామర్శించారు. - కల్వకుర్తి, ఫిబ్రవరి 14

ప్రియాంక జీ.. ఫ్రీ స్కూటీ ఎక్కడ?

ప్రియాంకగాంధీకి పోస్టు కార్డులు రాసిన కళాశాల విద్యార్థినులు

- హామీ అమలుపై విద్యార్థినుల పోస్టుకార్డులు
- మహిళలకు రూ.2500 ఏమైందంటూ ప్రశ్నోత్తరాలు
- మద్దతు తెలిపిన బీఆర్ఎస్‌వీ జిల్లా కోర్డినేటర్ పల్లయ్య

ప్రియాంకగాంధీకి పోస్టుకార్డు రాస్తున్న విద్యార్థినులు

గద్వాల, ఫిబ్రవరి 14 : ఉచిత స్కూటీ హామీ అమలు ఏమైందంటూ జిల్లా కేంద్రంలోని ఎంఏఎల్‌డీ, ఎస్‌వీఎం డిగ్రీ కళాశాల విద్యార్థినులు పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. పోస్టుకార్డులపై ప్రియాంకజీ ఎక్కడ నా స్కూటీ అంటూ ఉత్తరాలు రాసి ప్రియాంక గాంధీకి పోస్టు చేశారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు అఖిల, వైష్ణవి, ఆసియా తదితరులు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీల్లో భాగంగా 23మే 2023 సరూర్‌నగర్ స్టేడియంలో యూత్ డిక్లరేషన్ పేరిట భారీ బహిరంగ సభ నిర్వహించి 18 ఏండ్లు నిండిన ప్రతి అమ్మాయికి ఉచితంగా ఎలక్ట్రికల్ స్కూటీతోపాటు మహిళలకు రూ.2500 ఇస్తామని ప్రకటించిన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ఊసే ఎత్తడం లేదని ఆరోపించారు. మాయమాటలతో రాష్ట్రంలో ఉన్న విద్యార్థినుల కుటుంబాలు కోటి ఆశలతో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి అధికారంలోకి తెస్తే అధికారంలోకి వచ్చి 14నెలలు కావస్తున్నా స్కూటీల ఊసెత్తడం లేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు ప్రియాంక గాంధీ అబద్ధాలకు అలవాటు పడ్డారని విమర్శించారు. ఇటు మహిళలు, అటు విద్యార్థులకు అమలు కాని హామీలు ఇచ్చి వారిని మోసం చేశారని ఆరోపించారు. విద్యార్థినులకు ఉచిత స్కూటీలు లేవు మహిళా భరోసా రూ.2500 లేదు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ద్వారా తులం బంగారం ఇస్తామని చెప్పి ప్రస్తుతం ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. ప్రజలను మోసం చేయడానికే హమీలన్నారు. హామీలను నమ్మి అందరం ప్రస్తుతం గోస పడుతున్నామని ఆరోపించారు.

ప్రియాంకగాంధీ మహిళ అయి ఉండి మహిళలు, విద్యార్థినులను ఎలా మోసం చేయాలనిపించిందని మండిపడ్డారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎలక్ట్రిక్ స్కూటీ హామీని సాధించేంత వరకు పోస్టుకార్డుల ద్వారా నిరసన తెలియజేసి పెద్ద ఎత్తున ఉద్యమించి విద్యార్థినులకు హక్కుగా రావాల్సిన స్కూటీలను ఇచ్చేవరకు కాంగ్రెస్ ప్రభుత్వం మీద ఒత్తిడి పెంచి సాధించుకుంటామన్నారు. మోసపూరిత కాంగ్రెస్ నాయకుల మాటలు ఇక ఎవరు నమ్మొద్దని సూచించారు. వీరికి బీఆర్ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య సంఘీభావం తెలిపారు.

- సాగునీరందక నెర్రెలు బారుతున్న పొలాలు
- 107ప్యాకేజీకి చేరని జూరాల నీరు
- ర్యాలంపాడులో 0.7 టీఎంసీల నిల్వ
- నెట్టెంపాడు ఆయకట్టు రైతుల ఆందోళన
- రూ.లక్షల్లో పెట్టుబడికి నష్టం వాటిల్లే అవకాశం
- ప్రజాపాలన ప్రభుత్వం పట్టించుకోవాలని వినతి

ర్యాలంపాడు రిజర్వాయర్‌లో అడుగంటిన నీరు

పంటలు ప్రశ్నార్థకం!

గట్టు, ఫిబ్రవరి 14 : నెట్టంపాడు ఎత్తిపోతల పథకం కింద సాగునీరు అందక గట్టు మండల రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పటి మాదిరిగానే యాసంగి పైర్ల సాగు చివరిదాకా నీరందుతుందని భావించిన గట్టు మండల రైతాంగం తమ పొలాల్లో వరిపైర్లను ఎక్కువ విస్తీర్ణంలో సాగుచేశారు. కొంత కాలం వారబంది ద్వారా సాగునీటి సరఫరా సవ్యంగా సాగింది. అయితే తదనంతరం సాగునీటి సరఫరా నిలిచిపోవడంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు. మండలంలో బోర్లు, బావుల కింద 3250 ఎకరాల్లో వరి వేరుశనగ సాగైంది. రైతుల ఇబ్బందులు తెలుసుకున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి గట్టు మండలంలోని 107 ప్యాకేజీ కాల్వలను ఇటీవల పరిశీలించి రెండు రోజులపాటు నీటిని విడుదల చేయించారు. ఆ నీరు పైర్లకు ఏమాత్రం సరిపోలేదు. దీంతో సాగునీటి కోసం రైతులు వారం, పదిరోజుల నుంచి అష్టకష్టాలు పడుతున్నారు. ఎప్పుడెప్పుడు కాల్వ నీరు వస్తుందోనని వేయి కండ్లతో ఎదురుచూస్తున్నారు. కాల్వలోని తోతట్టు ప్రాంతాల్లో గుంతలు ఏర్పాటు చేసుకుని మోటర్ల ద్వారా తాత్కాలికంగా తమ పంటలను కాపాడుకుంటున్నారు. ఇదిలావుండగా అధికారుల సమాధానం మాత్రం వేరేవిధంగా ఉన్నది. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా 105 ప్యాకేజీ డీ-5 వరకు మాత్రమే వారాబందీ ద్వారా సాగునీటిని వదులుతామని ఇదివరకే చెప్పామని, రైతులు అనవసరంగా పంటలు వేసుకున్నారని చెబుతున్నారు. తాము ఆ రు తడి పంటలు వేసుకోమని సూచిస్తే, వరిపంట వేసుకుని రైతులు అనవసర ఇబ్బందులు తెచ్చుకుంటున్నారంటున్నారు. కాగా గతంలో మాదిరిగా యాసంగిలో సాగునీరు అందుతుందని భావించడంతోపాటు ఏప్రిల్ 15వరకు సాగునీటి సరఫరా అవుతుందని అధికారులు చెప్పడంతోనే తాము రబీలో పైర్లను సాగుచేశామని రైతులు చెబుతున్నారు. ఈ పరిస్థితి ఇదిలాఉండగా ర్యాలంపాడు రిజర్వాయర్‌లో రోజురోజుకూ నీరు అడుగంటిపోతున్నది. తాజాగా 14వ తేదీ గురువారం వరకు రిజర్వాయర్‌లో నీటి నిల్వ 0.7 టీంఎంసీలుగా ఉన్నది. రిజర్వాయర్ పూర్తి నీటినిల్వ సామర్థ్యం 4 టీఎంసీలు ఉండగా, లీకేజీల కారణంగా 2టీఎంసీలకే కుదించారు. దీనికారణంగా 2టీఎంసీల నిల్వను కోల్పోవడం రైతులకు శాపంగా మారింది. ఇదే ఇప్పుడు రైతులకు ఇబ్బందికర పరిస్థితి తలెత్తేలా చేస్తోందని అభిప్రాయపడుతున్నారు. ఇదిలావుండగా జూరాలకు 4టీఎంసీలు వదలాలని మంత్రి జూపల్లితోపాటు జిల్లా ఎమ్మెల్యేలు కర్ణాటకకు వెళ్లి నీటి విడుదలకు సీఎం, సంబంధింత మంత్రులు అంగీకరించినట్లు చెప్పుకొచ్చారు. అది ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. జూరాలకు నీరు వచ్చి చేరితే పంపింగ్‌ను ప్రారంభించి ర్యాలంపాడు రిజర్వాయర్‌లోకి అవసరమయ్యే నీటిని నింపి యాసంగి గండాన్ని గట్టెక్కించాలనే ఆ లోచనలో ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు. అయితే కర్ణాటక ప్రభుత్వం కరుణపైనే తెలంగాణ రైతుల భవిష్యత్ ఆధారపడి ఉంది. కాగా నీటి విడుదల జాప్యమయ్యే కొద్దీ చేతికొచ్చిన రైతుల పంటలు ప్రమాదంలో పడే అవకాశం ఉంది. తద్వారా రూ.లక్షలు పెట్టుబడి పెట్టిన రైతుల పంటలు చేయిజారే అవకాశం ఉంది. ఈ విషయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి పంటలు ఎండిపోకుండా నీటిని విడుదల చేయించి తమ ప్రయోజనాలు కాపాడాలని రైతులు కోరుతున్నారు.





107ప్యాకేజీ కాల్వలో ఇంకిపోయిన నీరు, కాల్వ కింద ఎండిన వేరుశనగ పంట

మూడు బోర్లున్నా అరకొరగానే..

నాకు మొత్తం 12 ఎకరాల పొలం ఉన్నది. మూడు బోర్లు ఉన్నా వాటితో కొద్దికొద్దిగానే నీరు వస్తాయి. కాల్వ నీరు వస్తాయని నాలుగు ఎకరాల్లో వరి, మరో 4 ఎకరాల్లో మిర్చి, మూడెకరాల్లో వేరుశనగ సాగు చేశా. కాల్వకు నీరు రానందున బోర్ల ద్వారా పంటలకు అరకొరగానే నీరు అందిస్తున్నా. గిట్టుబాట ధర లేకపోవడంతోపాటు నీటి కొరత కారణంగా మిర్చి పంటను ఇటీవలనే ఎండగొట్టా. **- రజావలి, రైతు, మాచర్ల**

ముక్కాలు ఎకరా పొగాకు వేశా..

నాకు ముక్కాలు ఎకరా పొలం ఉంది. ఇందులో పొగాకు సాగుచేశా. ఎలాంటి బోరు సౌకర్యం లేదు. కాల్వ ఆధారంగా పంట వేసినం. కాల్వతో నీరు రాకపోవడంతో పక్క రైతుల బోర్లతో నీటిని పారించుకుంటున్నా. పక్క రైతులు కూడా ఎంతవరకు నాకు నీరు ఇస్తరు. పంట ఎండిపోయే ప్రమాదం ఉంది. ప్రజాప్రతినిధులు, అధికారులు ఆదుకుని కాల్వకు నీటిని విడుదల చేయాలి. **- నర్సింహులు, రైతు, గట్టు**

పంటలు వేసుకోవద్దని ముందే చెప్పాం..

జూరాల, నెట్టంపాడు కింద యాసంగిలో ఎంత విస్తీర్ణంలో పంటలు సాగుచేసుకోవాలో రైతులకు జనవరి మొదటి వారంలోనే మీడియా ద్వారా తెలియజేశాం. నెట్టంపాడు కింద 105 ప్యాకేజీ డీ-5 వరకు మాత్రమే వారబందీ ద్వారా సాగునీటిని అందిస్తామని చెప్పాం. రైతులు వినిపించుకోకుండా వివిధ ప్యాకేజీల కాల్వల కింద పైర్లను సాగుచేశారు. మానవతా ధృక్పథంతో సంక్రాంతి వరకు సాగునీటిని అందించాం. కర్ణాటక నుంచి జూరాలకు నీరు విడుదలైతే నీటిని విడుదల చేసే అవకాశాలు పరిశీలిస్తాం. **- రహీముద్దీన్, పీజేపీ ఇన్‌చార్జి ఎస్ఈ**

పునరావాస ప్యాకేజీకే మా పోరాటం

ఉదండాపూర్‌లో రిలే నిరాహారదీక్ష కొనసాగిస్తున్న నిర్వాసితులు

- 3వ రోజూ ఉదండాపూర్ నిర్వాసితుల రిలే నిరాహారదీక్ష
- ప్రస్తుత రేటు ప్రకారం పరిహారం ఇవ్వాలని నినాదాలు

జడ్చర్లటౌన్, ఫిబ్రవరి 14: పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా ఉదండాపూర్ రిజర్వాయర్‌లో భూములు కోల్పోయిన నిర్వాసితులకు పునరావాస ప్యాకేజీని పెంచి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ చేపడుతున్న రిలే నిరాహార దీక్ష శుక్రవారం మూడో రోజుకు చేరుకున్నది. జడ్చర్ల మండలంలోని ఉదండాపూర్ రిజర్వాయర్ కట్ట వద్ద నిర్వాసితులు టెంట్ వేసుకొని రిలే దీక్షకు పూనుకున్నారు. రిజర్వాయర్ కట్ట వద్ద పనులకు సిద్ధమవుతున్నారన్న విషయాన్ని తెలుసుకున్న నిర్వాసితులు ప్రాజెక్టు కట్ట వద్దకు వెళ్లి పనులు చేయొద్దంటూ జేసీబీలను నిలిపివేసి పనులను అడ్డుకున్నారు. మాకు న్యాయం జరిగే వరకు పనులు చేయొద్దంటూ హెచ్చరించారు. ఆ తర్వాత నిర్వాసితులు రిలే నిరాహార దీక్షలో బైఠాయించి పునరావాస ప్యాకేజీ ఇవ్వాలంటూ నినాదాలు చేశారు. ఈ విషయాన్ని తెలుసుకున్న జడ్చర్ల ఎస్సై చంద్రమోహన్ పోలీసులతో దీక్షా శిబిరం వద్దకు చేరుకుని నిర్వాసితులతో మాట్లాడారు. అనంతరం అక్కడి పరిస్థితిని ఉన్నతాధికారులకు తెలియజేశారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ.. ఎన్నికల సందర్భంగా ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు తక్షణమే రూ.25 లక్షలు ఇవ్వాలని నిర్వాసితులు డిమాండ్ చేశారు. రిజర్వాయర్ కోసం మా భూములు, ఇండ్లు కోల్పోయి న్యాయం కోసం పోరాటం చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత రేటు ప్రకారం ప్యాకేజీ పరిహారాన్ని నిర్ణయించి డబ్బులు చెల్లించే వరకు ప్రాజెక్టు వద్ద ఎలాంటి పనులు చేపట్టవద్దని కోరారు. నిర్వాసితులందరికీ పునరావాస ప్యాకేజీ పెంచి ఇచ్చేవరకు రిలేనిరాహార దీక్షలు కొనసాగిస్తామన్నారు. శాంతిపూర్వకంగా చేస్తున్న దీక్షను అడ్డుకునేందుకు ఎవరైనా యత్నిస్తే తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

పండుగ సాయన్న ఆశయాలను కొనసాగిస్తాం

- శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ ముదిరాజ్

పండుగ సాయన్న విగ్రహానికి పూలమాల వేస్తున్న మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్

పాలమూరు ఫిబ్రవరి 14: పాలమూరు వీరుడు పండుగ సాయన్న ఆశయాలను కొనసాగిస్తామని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ ముదిరాజ్ అన్నారు. శుక్రవారం మహబూబ్‌నగర్ మండల పరిధిలోని ధర్మపురం గ్రామంలో పండుగ సాయన్న విగ్రహాన్ని ఆవిష్కరించారు. పేదల కోసం రాబిన్ హుడ్‌గా అవతారం ఎత్తి బడుగు బలహీన వర్గాల ప్రజలకు సేవ చేశారన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ముచ్చటగా ముదిరాజులకు మూడు సీట్లు ఇచ్చి గెలిచిన ఒకే ఒక అభ్యర్థి వాకిటి శ్రీహరికి మంత్రి పదవి ఇస్తానని ఇంకా ఊరిస్తోందని దీని భావమేందో తెలంగాణ ముదిరాజులు అర్థం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు . బీసీ కులగణలో బీసీలను 20 లక్షలకు పైగా తక్కువ చూపి కాంగ్రెస్ పార్టీ చారిత్రాత్మక తప్పిదం చేసిందని .. రీ సర్వే లో న్యాయం చేయకపోతే బీసీల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో అధికారంలోకి రాగానే అందేశ్రీ రచించిన తెలంగాణ రాష్ట్ర గీతంలో పాలమూరు వీరుడు రాబిన్ హుడ్ పండుగ సాయన్న వీరగాథను పొందుపరిచామని, ప్రతిరోజూ ప్రతి పాఠశాలలో ఆయనను స్మరించుకుంటున్నామని తెలిపారు. బీసీ నేత బెక్కెం జనార్దన్ రచించిన పండుగ సాయన్న పుస్తకాన్ని బండ ప్రకాశ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పెద్ద విజయ్ కుమార్, వెంకటేశ్, బెక్కెం జనార్దన్, ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు మెట్టుకాడి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏసీబీ వలలో పంచాయతీ అధికారులు

- తనఖా ప్లాట్ల రిజిస్ట్రేషన్‌పై రూ.2లక్షలకు బేరం
- పట్టుబడిన డీపీవో, పంచాయతీ కార్యదర్శి

అలంపూర్ చౌరస్తా, ఫిబ్రవరి 14: గ్రామ పరిపాలన వ్యవస్థ చేయాల్సిన పంచాయతీ అధికారులు అవినీతి సొమ్ముకు కక్కుర్తి పడి అడ్డదారులు తొక్కుతున్న అధికారులపై ఏసీబీ అధికారులు శుక్రవారం పంజా విసిరారు. ఉండవెల్లి మండలంలోని పుల్లూరు జీపీలోని అన్నపూర్ణ గ్రీన్ హిల్స్ వెంచర్‌లో జీపీకి తనఖా పెట్టిన ప్లాట్లను పంచాయతీ అనుమతి లేకుండా సబ్‌రిజిస్ట్రార్ అధికారుల సహకారంతో వెంచర్ యాజమని ఓ బిల్డర్‌కు రిజిస్ట్రార్ చేశాడని కొందరు డీపీవో శ్యామ్‌సుందర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అధారంగా డీపీవో పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి చేత నోటీసులు ఇప్పించాడు. నోటీసులపై చర్యలు లేకుండా ఉండేందుకు యజమానులు పంచాయతీ కార్యదర్శిని ఆశ్రయించారు. డీపీవో, పీఎస్ కలిసి నోటీసులు వెనక్కి తీసుకునేందుకు రూ.3లక్షలు డిమాండ్ చేశారు. చివరకు డీపీవోకు రూ.1.50 లక్షలు, పీఎస్‌కు రూ.50వేలు ఇచ్చేందుకు వెంచర్ యజమానులు బేరం కుదుర్చుకున్నారు. దీంతో వెంచర్ యజమానులు ఏసీబీ అధికారులకు సమాచారమిచ్చి శుక్రవారం ఉండవెల్లి మండలం బూడిదపాడు శివారులో రూ.2లక్షలను పంచాయతీ కార్యదర్శి చేతికి అందించారు. నగదు ముట్టిన వెంటనే ఫోన్ ద్వారా డీపీవోకు నగదు ముట్టినట్లు సమాచారం అందించాడు. దీంతో అక్కడే ఉన్న ఏసీబీ అధికారులు కార్యదర్శిని అదుపులోకి తీసుకున్నారు. అప్పటికే ఏసీబీ ట్రాప్‌లో ఉన్న డీపీవోను కూడా అదుపులోకి తీసుకొని విచారణ మెదలుపెట్టారు. అనంతరం అధికారులు రంగంలోకి దిగి డీపీవో కార్యాలయంలో సోదాలు చేశారు. కార్యదర్శిని జిల్లా కేంద్రానికి తీసుకుకెళ్లి డీపీవో కార్యాలయంలో ఇద్దరిని ఒకేచోట ఉంచి ఏసీబీ అధికారులు విచారణ చేశారు. దాడుల్లో డీపీవోకు రూ.1.50 లక్షలు, పంచాయతీ కార్యదర్శికి రూ.50వేలు లంచం తీసుకున్నట్లు నిర్ధారించి ఏ1గా డీపీవో శ్యామ్‌సుందర్, ఏ2గా ప్రవీణ్‌కుమార్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఏసీబీ డీఎస్పీ తెలిపారు.

మా డబ్బులు ఇప్పించండి

- 'సుభాని' బాధితుల డిమాండ్
- షేర్ మార్కెట్‌లో పెట్టుబడితో అధిక వడ్డీ ఇస్తామని మోసం చేశారని ఆగ్రహం
- న్యాయం జరిగేలా చూస్తామన్న ఎమ్మెల్యే

ఆందోళన చేస్తున్న బాధితులకు సర్దిచెబుతున్న పోలీసులు

మక్తల్, ఫిబ్రవరి 14 : షేర్ మార్కెట్ పేరుతో పెట్టుబడులు పెట్టించి పరారైన వ్యక్తి నుంచి డబ్బులు ఇప్పించాలని బాధితులు డిమాండ్ చేశారు. శుక్రవారం మక్తల్ పోలీస్‌స్టేషన్ వద్దకు బాధితులు పెద్ద ఎత్తున చేరుకొని పీఎస్ గేటు ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఏపీలోని నెల్లూరు జిల్లా కావలికి చెందిన సుభాని మక్తల్‌లో షేర్ మార్కెట్ పేరుతో పలువురిని నమ్మించాడన్నారు. దీంతో అధికంగా వడ్డీ వస్తుందని ఆశపడి మక్తల్‌కు చెందిన పలువురు డబ్బులు పెట్టుబడి పెట్టారని తెలిపారు. మొదల్లో వడ్డీ అందిస్తూ వచ్చారని, దీంతో నమ్మిన జనం రూ.లక్షల్లో ఇన్వెస్ట్‌మెంట్ చేశారన్నారు. 2021లో డబ్బులతో పరారీ కావడంతో పోలీస్‌స్టేషన్ మెట్లు ఎక్కాల్సి వచ్చిందన్నారు. కాగా సుభాని ఇక్కడి ప్రజలను మోసి చేసిన విధంగానే నెల్లూరు జిల్లా వాసులను మోసం చేసే క్రమంలో జైలుపాలయ్యాడని చెప్పారు. దీంతో అక్కడి పోలీసులను అరెస్టు చేశారని, ఇక్కడి పోలీసులు వారితో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు. సుభానీ నుంచి తాము పెట్టిన డబ్బులు ఇప్పించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దీంతో సీఐ చంద్రశేఖర్, ఎస్సై భాగ్యలక్ష్మిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం సమస్య ఏపీ పోలీసుల పరిధిలో ఉందని, అక్కడి అధికారులతో మాట్లాడి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అయినా బాధితులు వినలేదు. విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే శ్రీహరి పీఎస్ వద్దకు చేరుకొని న్యాయం చేస్తామని భరోసానిచ్చారు. ఎస్పీతో ఇప్పటికే మాట్లాడామని, మూడ్రోజుల తర్వాత మరోసారి కలిసి సుభాని విషయం మాట్లాడుతానని, అవసరమైతే కావలికి వెళ్లి ఇక్కడి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.

అయినవారే హంతకులు

- ఆస్తికోసం అన్నను చంపిన వైనం
- ఆరుగురు నిందితుల అరెస్టు, పరారీలో తల్లి
- కారు, మూడు వేటకొడవళ్లు, సెల్‌ఫోన్లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ శ్రీనివాసరావు

గద్వాల అర్బన్, ఫిబ్రవరి 14: ఆస్తి కోసం సొంత సోదరుడిని అన్న, తమ్ముడు, తల్లి దండ్రి స్నేహితులతో కలిసి హత్యచేసినట్లు ఎస్పీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ఈనెల 12వ తేదీన తనగల గ్రామానికి చెందిన రమేశ్ మద్దూరు స్టేజీ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. తన భర్త మృతిపై అనుమానం ఉందని భార్య సంధ్యపోగు చంద్రకళ శాంతినగర్ ఠాణాలో ఫిర్యాదు చేసింది. కొంతకాలంగా ఆస్తికి సంబంధించి తన భర్తకు తల్లిదండ్రులు, అన్నదమ్ములకు గొడవలున్నట్లు అనుమానం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన శాంతినగర్ పోలీస్‌లు దర్యాప్తు చేపట్టారు. మృతుడు రమేశ్ తన తండ్రి కిష్టన్న, తల్లి తిములమ్మ, అన్న గోపి, తమ్ముడు మహేశ్‌కు ఆస్తి వివాదంలో ఘర్షణలు ఉన్నట్లు తేలింది. గతేడాది మహేశ్ బైక్‌పై వస్తుండగా మృతుడు రమేశ్ హత్యాయత్నం చేయగా.. కేసులు నమోదయ్యాయి. ఈ క్రమంలో తన అన్న రమేశ్‌ను ఎలాగైనా చంపాలని నిర్ణయించుకున్న మహేశ్ తల్లిదండ్రులతోపాటు మరో అన్న గోపి పతకం పన్నారు. మహేశ్ తనకు పరిచయమున్న బోయ నర్సింహులకు విషయం చెప్పి తన అన్న రమేశ్‌ను చంపితే రూ.లక్షాయాభై వేలు ఇస్తామని ఒప్పందం చేసుకొన్నారు. అందుకు మరో ఇద్దరైన బండమీది తిమ్మప్ప, బోయ నాగేంద్ర సహకారం తీసుకొన్నారు. ఈ క్రమంలో రమేశ్‌ను చంపాలని వారం కిందట పతకం వేశారు. రమేశ్ వెంకటాపురం స్టేజీ నుంచి యాపదిన్నెకు వెళ్తుండగా.. బొలేరోతో ఢీ కొట్టి చంపాలని నిర్ణయించగా కుదరలేదు. అనంతరం 12వ తేదీన రమేశ్ తన మామ సుధాకర్‌తో కలిసి అలంపూర్ కోర్టు పనుల నిమిత్తం వెళ్లి వస్తుండగా.. మహేశ్, బోయ నర్సింహులు కారులో, బండమీద తిమ్మప్ప, బోయ నాగేంద్ర బొలేరోలో అనుసరించి పతకం ప్రకారం మద్దూరు స్టేజీ దగ్గర ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో రమేశ్, తన మామ కిందకు పడగా.. వెంటనే కారులో ఉన్న మహేశ్, బోయ నర్సింహులు వెంట తెచ్చుకున్న వేట కొడవల్లతో రమేశ్ గొంతు నరికి చంపారు. అనంతరం రమేశ్ మామపై దాడిచేసి అదే కారులో నిందితులు అక్కడి నుంచి పారిపోయారు. అనంతరం డీఎస్పీ మొగిలయ్య, సీఐ టాటాబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలతో సాంకేతి పరిజ్ఞానం, సీసీ కెమెరాల ఆధారంగా నమ్మదగిన సమాచారం మేరకు నిఘా నిర్వహించగా.. న్యాయవాది కోసం హైదరాబాద్‌కు కారులో వెళ్తుండగా.. జాతీయ రహదారిపై జల్లాపూర్ ఆర్టీఏ చెక్‌పోస్టు వద్ద మధ్యాహ్నం 2గంటలకు నిందితులను పట్టుకున్నట్లు తెలిపారు. నిందితులు ఏ1.కిష్టన్న(తండ్రి), ఏ2.తిములమ్మ(తల్లి), ఏ3.గోపి(అన్న), ఏ4.మహేశ్(తమ్ముడు), ఏ5. బోయ నర్సింహులు, ఏ6. బండమీద తిమ్మప్ప, ఏ7 బోయ నాగేంద్ర. వీరిలో ఏ2.తిమ్ములమ్మ పరారీలో ఉండగా మిగతా వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు. అనంతరం వారి నుంచి వేట కొడవళ్లతోపాటు కారు, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన అయిజ, మానవపాడు ఎస్సైలు, బాషా, స్వామి, రాజు, వెంకప్ప, హుస్సేన్, యాకుబ్‌ను ఎస్పీ అభినందించారు.

జేఈఈ మెయిన్స్‌లో అక్షర ప్రభంజనం

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 14 : జేఈఈ మెయిన్స్ 2025 పరీక్షా ఫలితాల్లో అక్షర జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. మహబూబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని అక్షర జూనియర్ కళాశాల ఐఐటీ - నీట్ అకాడమీకి చెందిన పి.చరణ్‌తేజ మొదటి దఫా జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 98.78 పర్సంటైల్ సాధించాడని అకాడమీ డైరెక్టర్, ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ తెలిపారు. కళాశాలకు చెందిన శృతి, శ్రీవర్ధన్, అఖిల్‌గౌడ్, అనుదీప్‌తోపాటు మిగతా విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని తెలిపారు. గతంలో నీట్, ఐపీఈ మార్కులతో కూడా స్టేట్ లెవల్ మార్కులు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు జియాఉద్దీన్, హరికృష్ణ, విష్ణువర్ధన్, యాకుబ్, జైపాల్, సునీత విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

చరణ్‌తేజను అభినందిస్తున్న డైరెక్టర్ విజయ్‌కుమార్ తదితరులు